## కోటి కుంకుమార్చనలో రాజ్యసభసభ్యులు వేమిరెడ్డి దంపతులు



**బుచ్చి జులై 22 ప్రభాతవార్త** పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి సన్నిధిలో జరుగుతున్న కోటికుంకుమార్చన నాలుగోవరోజుకి చేరుకుంది.కోటికుంకుమార్చన కార్యక్రమంలో రాజ్యసభసభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి,వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఉభయకర్తలుగా వ్యవహారించారు.ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు దంపతులు,పాలక మండలి సభ్యులు ఆలయ అర్చకులు వారిని ఘనంగా స్వాగతించారు.ఆదంపతులు ఉదయం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు,నవావరణ పూజలు,గోపూజ,వృషబార్చన,లక్ష్మీగణపతి తదితరపూజ కార్యక్రమాలు నిర్వహించారు.స్వామి అమ్మవార్లకు కోటికుంకుమార్చన చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు మాట్లాడుతు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు దాతృత్వానికి నిర్వచనం అన్నారు.2018లో కూడా వారు కోటికుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి సేవలో తరించారని అన్నారు.మంచి మనస్సున ఆ దంపతులకు అమ్మవారి స్వామి వారి ఆశీస్సులు ఉండాలని ఆయన కోరారు.కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సహకారం మరువలేనిదని అన్నారు. ఆయన ఇక్కడ జరిగే కార్యక్రమాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారని తెలిపారు.బెంగుళూరు వాస్తవ్యులు అమ్మవారికి 7లక్షలా 36 వేల రూపాయాలు కాసుల హారం సమర్పించారని ఆయన తెలిపారు.వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా అన్ని వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ ఆలయంలో చైర్మన్‌గా సేవచేసుకునే అవకాశం కల్పించిన ఎమ్మెల్యే నల్లపరెడ్డిప్రసన్నకుమార్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.పిడూరు శంకర్‌రెడ్డి,శ్వేత దంపతులు ఆలయానికి భారీ బడ్జెట్‌తో అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నందుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.ఆలయం వద్ద భద్రతాఏర్పాట్లను ఎస్ఐ వీరప్రతాప్ పరిశీలించారు.

## సస్పెండైన టిఏపై విచారణ



**వరికుంటపాడు,జూలై 22,ప్రభాతవార్త :** ఉపాధి హామి పథకం లో 2012 అక్రమాలకు పాల్పడిపడినట్లు ఆడిట్ బృందం ఇచ్చిన నివేదికలు ఆధారంగా అప్పటి అధికారులు టిఏ జనార్ధన్ ను సస్పెండ్ చేయడంతో పాటు 4 లక్షల రూపాయలు రికవరికి ఆదేశించారు.ఈ విషయం పై అతను హైకోర్టును ఆశ్రయించడంతో ,కోర్టు పూర్తి విచారణ జరిపి నివేదికలు అందజేయమని జిల్లా అధికారులను ఆదేశించారు.దీంతో డ్వామా అడిషనల్ పీడీ నిర్మలా దేవి శనివారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో విచారణ చేపట్టారు.ఈ విచారణకు హాజరైన అతను తను పని చేసే సమయంలో 24 పంచాయతీలకు టిఏ గా ఒక్కడినే విధులు నిర్వహించానని,ఆ సమయంలో చేపట్టిన పనులకు సంబందించిన బిల్లులు నిబంధనల మేరకే కూలీలకు,కాంట్రాక్టర్‌ల కు అందేలా చూసానని తెలిపారు.డ్వామా ఎపిడి నిర్మలాదేవి మాట్లాడుతూ విచారణ నివేదికలను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

## సచివాలయం పరిశీలించిన జడ్పీ సీఈఓ చిరంజీవి

**విడవలూరు, జూలై 22, ప్రభాతవార్త** ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి శనివారం జడ్పీ సీఈఓ చిరంజీవి విడవలూరు సచివాలయం పరిశీలన చేశారు. జగనన్న సురక్ష, అమ్మ ఒడి, పెన్షన్లు పలు పథకాలపై కూడా సచివాలయం సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే పది పథకాన్ని ప్రజలకు అందే విధంగా సిబ్బంది పని చేయాలని ఆదేశించారు. సచివాలయం సిబ్బంది తప్పనిసరిగా ప్రభుత్వం అందించిన యూనిఫామ్ ధరించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఉదయ్, వీఆర్వో వెంకటేశ్వర్లు, మహిళా కానిస్టేబుల్ రమ్య, ఆనంద్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

## నెల్లూరుపాళెంలో ఘరానా మోసం -రూ 4కోట్లతో ఉడాయించిన భాస్కర్‌రెడ్డి



**ఆత్మకూరు,జులై22ప్రభాతవార్త:**ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెంలో బద్వేల్‌కు చెందిన భాస్కర్‌రెడ్డి అనే వ్యక్తి 4కోట్ల రూపాయలతో ఉడాయించిన ఉదంతం శనివారం వెలుగులోకి వచ్చింది. ఇంటి యజమాని ఎం.రోశయ్యతోపాటు బాధితులు ఆత్మకూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వైఎస్ఆర్ కడపజిల్లా బద్వేల్‌కు చెందిన భాస్కర్‌రెడ్డి నెల్లూరుపాళెం సెంటర్‌లో మక్కెన రోశయ్య ఇంట్లో రెండు నెలల క్రితం అద్దెకు దిగాడు. తాను సిగిరెట్స్ హోల్‌సేల్ వ్యాపారం , చక్కెర వ్యాపారం చేస్తుంటానని నమ్మబలికాడు. భాస్కర్‌రెడ్డి నివాసముంటున్న ఇంటి సమీపంలో కొన్ని మినీ ట్రక్‌లు వచ్చి వెళుతుండేవి. ఖరీదైన కారుల్లో తిరుగుతూ తాను పెద్ద వ్యాపారస్తుడిలా నమ్మబలికాడు. తనకు సిగిరెట్లు, చక్కెర వ్యాపారంలో కోట్లాదిరూపాయల ఆదాయం వస్తుందని పలువురిని నమ్మించాడు. ఈక్రమంలో ఇంటి యజమాని రోశయ్య దగ్గర 1.35కోట్ల రూపాయలు, మరికొంతమంది దగ్గర మరో 2.65కోట్లు రూపాయలు సుమారు 4కోట్ల రూపాయల వరకు నగదును తీసుకున్నాడు. వీరందరికీ తాను చేస్తున్న వ్యాపారంలో భాగస్వామ్యం కల్పిస్తామని ఆశచూపి డబ్బులు వసూలు చేసుకున్నాడు. డబ్బులు ఇచ్చిన బాధితులకు ఎలాంటి వ్రాతపత్రాలు లేవు. శనివారం బెంగుళూరు వెళ్ళి వ్యాపార లావాదేవీలను పరిశీలించి వస్తానని డబ్బులు ఇచ్చిన వారికి నమ్మబలికాడు. డబ్బులు ఇచ్చిన వారు భాస్కర్‌రెడ్డితో కలసి బెంగుళూరుకు సిద్ధమయ్యారు. ఈ లోపు భాస్కర్‌రెడ్డి తాను బాడుగకు ఉంటున్న ఇంటి నుండి ఉడాయించాడు. దాంతో మోసపోయామని గ్రహించిన బాధితులు బావురమంటూ ఆత్మకూరు పోలీసులను ఆశ్రయించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆత్మకూరు ఎస్ఐలు ముత్యాలరావ్, రాజేష్‌లు నెల్లూరుపాళెంలోని భాస్కర్‌రెడ్డి అద్దెకుంటున్న ఇంటిని తాళాలు పగులగొట్టి పరిశీలించారు. వారికి భాస్కర్‌రెడ్డికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించలేదని సమాచారం.ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**విచారణ జరుపుతున్నాం** నెల్లూరుపాళెం సెంటర్‌లో ఒక ఇంటిని అద్దెకు తీసుకొని గ్రామస్తుల నుండి కోట్ల రూపాయలు వసూలు చేసుకొని పరారైన బద్వేల్ వాసి భాస్కర్‌రెడ్డి వ్యవహారంపై విచారణ వేగవంతంగా చేస్తున్నామని ఆత్మకూరు డియస్పీ ఎం.కోటారెడ్డి తెలిపారు. నెల్లూరుపాళెం సంఘటనపై ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ భాస్కర్‌రెడ్డి సిగరెట్, చక్కెర హోల్‌సేల్ వ్యాపారస్తుడని నెల్లూరుపాళెం వాసులను, తన ఇంటి యజమాని రోశయ్యను నమ్మబలికి సుమారు 2.93కోట్ల రూపాయలను వసూలు చేశాడన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఈ కేసును సమగ్రంగా దర్యాప్తు జరుపుతామన్నారు. భాస్కర్‌రెడ్డికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు బాధితుల వద్ద లేవని డియస్పీ పేర్కొన్నారు.

## దర్శనసమయంలో స్వామివారు కనపడడంలేదు



**వలేటివారిపాలెం జూలై 22, ప్రభాతవార్త** మండలంలోని మాలకొండ నందలి శ్రీమాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామివారిని దర్శించు విషయంలో ఉచిత దర్శన భక్తులుకు గర్భగుడిలో స్వామివారి విగ్రహం సరిగా కనిపించడంలేదని ఆవేదన చెందుతున్నారు.సుమారు 2గంటల పాటు క్యూలో నిల్చొని గర్భగుడిలోకి వెళ్లగా 'ప్రత్యేక దర్శన భక్తుల క్యూ' తమకు అడ్డం వస్తుందని వాపోతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి అనేక వ్యయప్రయాసలతో క్యూలో గర్భగుడిలోని స్వామి వారి విగ్రహానికి ఎదురుగా వెళ్లే సమయానికి ప్రత్యేక దర్శనక్యూలోని భక్తులు తమకు అడ్డుగా నిలబడడం వలన తమకు స్వామివారు కనిపించడంలేదని వాపోతున్నారు.వాస్తవానికి భక్తులు రూ.100లు చెల్లించి ప్రత్యేకదర్శన టికెట్ తీసుకుంటారు.ఈ టికెట్ ద్వారా వీరికి ప్రత్యేక దర్శనమేకానీ ప్రత్యేక పూజలుకు అవకాశం లేదు.వీరంతో స్వామివారిని దర్శించి,పక్కనే ఉన్న వెంకటేశ్వరస్వామివారి ఆలయం మీదుగా గర్భగుడి బయటకు వచ్చేంతవరకు ప్రత్యేక క్యూ లోనే వస్తుంటారు.ఈ నేపద్యంలో స్వామివారి దర్శన సమయంలో ఉచిత క్యూ భక్తులకి ప్రత్యేక భక్తుల క్యూ అడ్డం వస్తుంది. సిబ్బంది భక్తులను త్వరత్వరగా పంపించినప్పటికిని క్యూ కొనసాగుతుండడంతో ఉచిత దర్శన క్యూలో భక్తులకు ఇబ్బంది కలుగుతుంది.

**ఏంచేయాలంటే:** ప్రత్యేక దర్శన క్యూ గర్భగుడి ముఖద్వారంలోకి వెళ్లగానే ఉచిత దర్శన క్యూలో కలిపేస్తే సమస్య ఉండదు. దీంతో స్వామివారు కనపడడం లేదన్న సమస్య తలెత్తడానికి వీలులేదు.

**స్వామివారి బొట్టుపెట్టే నాధుడేడి?**

మాలకొండ స్వామి ఆలయప్రాంగణంలో భక్తులకు స్వామివారి బొట్టు (కుంకుమ) అందుబాటులో లేదు. తలనీలాలు సమర్పించిన వారికి మాత్రం ప్రైవేటు వ్యక్తులు నామమాత్ర రుసుముతో నుదుట బొట్టు పెడుతున్నారు. మిగిలిన భక్తులుకు ఆలయ ప్రాంగణంలో ఎక్కడా బొట్టు పెట్టుకోవడానికి కుంకుమ కూడా అందుబాటులో లేదు. పెట్టే వారేలేరు.లేదా భక్తులే పెట్టుకోవడానికి కుంకుమ వగైరాలు అందుబాటులో లేవు.దీంతో భక్తులు మనోభావాలు దెబ్బతింటున్నాయి. ఎంతో భక్తిశ్రద్ధలతో మాలకొండ వస్తే కనీసం భక్తిభావం ఉట్టిపడే చర్యలు లేకపోవడం బాధాకరంగా ఉందని పలువురు ఆవేదన చెందుతున్నారు. ఒకరు లేదా ఇద్దరు పూజారులను ఇందుకోసం కేటాయించాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

# శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త

## రైస్‌మిల్లుపై దాడులు...350 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

**కొండాపురం, జులై 22 ప్రభాతవార్త** కొండాపురం మండలంలోని సాయిపేట గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహా రైస్‌మిల్‌పై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 350 బస్తాల రేషన్ బియ్యం వున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి టి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మాకు అందిన సమాచారం మేరకు ఈ రైస్‌మిల్లుపై దాడులు చేసామన్నారు. ఈ దాడుల్లో 350 బస్తాల రేషన్ బియ్యం మిల్లులో అక్రమంగా నిల్వ వున్నట్లు గుర్తించామన్నారు. రైస్‌మిల్ యజమాని రామారావుపై 6ఎ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మిల్‌ను సీజ్ చేశామన్నారు. డిఎస్‌వో వెంట ఎఎస్‌వో డి.అంకయ్య, సిఎస్‌డిటి జనార్ధన్, పౌరసరఫరాల శాఖ అధికారులు వున్నారు.

## ఆక్సిజన్ అందక కాదు.. అనారోగ్యంతో మృతి చెందినట్లు డాక్టర్ల నిర్ధారణ

### వైద్యసేవల్లో ఎటువంటి లోపం లేదు.. పుకార్లు నమ్మకండి
### కలెక్టర్ హరినారాయణన్



**నెల్లూరు జూలై 22, ప్రభాతవార్త-వైద్యం** నెల్లూరు నగరంలోని దర్గామిట్టలో ఉన్న ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఒకేరోజు ఏకంగా 8మంది మరణించారని.. వార్త దావానంలా వ్యాపించడంతో పాటు.. ఆక్సిజన్ అందక మరణించారని తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతుండడంతో కలెక్టర్ హరినారాయణ విచారణకు ఆదేశించారు. అనంతరం శనివారం సాయంత్రం జీజీహెచ్‌లో తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రికి చేరుకుని ఐసీయును పరిశీలించారు. అధికారులతో సమీక్ష నిర్వహించి వాస్తవాలు తెలుసుకున్నారు. అసలు ఏమి జరిగింది. బాధితులకు ఎలాంటి వైద్య సేవలు అందించారో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐసీయు వార్డును పరిశీలించామని ఎలాంటి లోపాలు లేవన్నారు. కేవలం అనారోగ్య కారణాల వల్లే మరణాలు సంభవించాయని తన పరిశీలనలో తేలిందన్నారు. రోగులను కూడా విచారించామని వైద్య చికిత్సలలో ఎలాంటి లోపాలు లేవని వారు చెప్పారన్నారు. ఈ మరణాలపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఆసుపత్రిలో అవసరమైన అన్ని మౌళిక వసతులు కోసం నిధులు కూడా విడుదల చేశారన్నారు.

**అన్ని బాగున్నాయి పూర్తిస్థాయిలో పరిశీలించా:** ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో కలెక్టర్ ఆదేశాల ప్రకారం పూర్తిస్థాయి పరిశీలన చేశామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎం పెంచలయ్య చెప్పారు. ఎక్కడ ఎలాంటి లోపాలు లేవని ఆక్సిజన్ సరఫరా బాగుందని విలేఖరులతో వివరించారు. జిల్లాలోని దూర ప్రాంతాల నుంచి పలు అక్సిజన్ అత్యవసర వైద్యం కోసం సిఫార్సు చేసినవారే ఎక్కువగా వస్తుంటారని చెప్పారు.

అలాంటి వారు ఎక్కువగా మృత్యువాత పడుతుంటారన్నారు. శనివారం కూడా నలుగురు వివిధ వ్యాధులతో చనిపోయారన్నారు. వారంరోజుల డేటాను ప్రతిరోజు పరిశీలిస్తే ఇద్దరు, ముగ్గురు రోగులు చనిపోతుంటారన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్, జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ రామచంద్రరావ్‌లు మాట్లాడుతూ ఆసుపత్రిలో ఆక్సిజన్ సరఫరాలో ఎలాంటి లోపాలు లేవన్నారు. వైద్యులు, సిబ్బంది వైఫల్యం ఎంతమాత్రం లేదన్నారు. తీవ్ర అనారోగ్యంతోనే బాధితులు మృత్యువాత పడ్డారన్నారు. వైద్యంలో ఎలాంటి లోపాలు లేవన్నారు.

**మరణించిన వారు వీరే**

నెల్లూరు నగరంలోని స్టోన్‌హౌస్‌పేటకు చెందిన లలిత (62) ఈనెల 19న ఆసుపత్రిలో చేరింది. నిమోనియాతో బాధపడుతున్న బాధితులు 21వ తేదీన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డారు. సాంబయ్య (53) అనే బాధితుడు గుండె వ్యాధితో ఈనెల 20వ తేదీన ఆసుప్రతిలో చేరి చికిత్స పొందుతూ మరణించారు. తోటపల్లిగూడూరు మండలం నరుకూరుకు చెందిని రమేష్ (42) అక్యూట్ పాంక్రియాసిస్‌తో ఈనెల 13న చికిత్స పొందుతూ తఈనెల 21న మరణించారు. నెల్లూరు నగరంలోని శ్రీనివాస నగర్‌కు చెందని చలపతి (52) ఈనెల 20వ తేదీన గుండె వ్యాధితో జీజీహెచ్‌లో చేరారు. ఈనెల 21న మృత్యువాత పడ్డారు. అలాగే కోటమిట్టకు చెందిన చెంచమ్మ (70) గుండెవ్యాధితో ఈనెల 21వ తేదీన ఆసుపత్రిలో చేరగా అదేరోజు సాయంత్రం 6,28గంటలకు మరణించారు. వేదాయపాలెంకు చెందిన సుందరం (70) షుగరు, బీపీ, గుండెవ్యాధులతో ఈనెల 17న ఆసుపత్రిలో చేరగా చికిత్స పొందుతూ ఈనెల 21న చనిపోవడం జరిగింది, వీరిని మహాప్రస్థానం ద్వారా వారి నివాసాలకు చేర్చటం కూడా ఒకేరోజు కావడం పలు విమర్శలకు దారి తీశాయి.

## రొట్టెల పండుగ నేపధ్యంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోండి



**నెల్లూరు కార్పోరేషన్, జూలై 22, ప్రభాతవార్త** రానున్న రొట్టెల పండుగ నేపధ్యంలో నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలోని ఆత్మకూరు బస్టాండ్ పరిసరాల్లో వాహనాల అక్రమ పార్కింగ్‌లను తొలగించి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని కమీషనర్ వికాస్ మర్మత్ ట్రాఫిక్ పోలీసు విభాగం, టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు అక్రమంగా రోడ్లపై పార్కింగ్‌లపై వచ్చిన ఫిర్యాదును పోలీసు అధికారులు, ఆర్అండ్‌బి, టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి ఆయా ప్రాంతాల్లో శనివారం పర్యటించి స్థానికులతో మాట్లాడి రోడ్లను ఆక్రమిస్తూ ఎలాంటి వాహనాల పార్కింగ్‌లు చేయవద్దని సూచించారు. అనంతరం కమీషనర్ రొట్టెల పండుగ నిర్వహణ ఏర్పాట్లను బారాషహీద్ దర్గాలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ రానున్న భక్తులను దృష్టిలో ఉంచుకుని నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో దర్గా ప్రాంగణంలో అన్ని వసతులు కల్పిస్తామని తెలిపారు. షామియానాలు, కమాండ్ కంట్రోల్ విభాగం, వీఐపీ రిసెప్షన్, సీసీ కెమెరాలు, విద్యుత్, లైటింగ్, పారిశుధ్యం, స్త్రీలకు మరుగుదొడ్ల పార్కింగ్, మహిళలకురక్షణ బారికేడ్ల నిర్మాణం, పోలీసుల పర్యవేక్షణ, స్వర్ణాల చెరువు తీరం వెంబడి భద్రతా చర్యలు వంటి వివిధ అంశాలకు ప్రాధాన్యత కల్పిస్తున్నామని తెలిపారు. అన్ని ప్రభుత్వ విభాగాలను సమన్వయం చేసుకుని రొట్టెల పండుగను ఘనంగా నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేయనున్నట్లు కమీషనర్ వెల్లడించారు. ఎస్ఈ సంపత్‌కుమార్, డీసీసీ దేవికుమారి, ఆరోగ్య శాఖాధికారి వెంకట రమణ, ఇంజనీరింగ్ టౌన్ ప్లానింగ్ అధికారులు, దర్గా కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు, మైనార్టీ నాయకులు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పనులు వేగవంతం అయ్యేలా లబ్దిదారులు సహకరించాలి



**కోవూరు జూలై 22 ప్రభాతవార్త :** జగనన్న కాలనీలో ప్రస్తుతం జరుగుతున్న గృహ నిర్మాణ పనులు మరింత వేగవంతం అయ్యేలా లబ్దిదారులు సహకరించాలని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజు తెలిపారు. కోవూరు మండలం కోవూరు మండలం నందలగుంట జగనన్న లేఅవుట్‌లో జరుగుతున్న నిర్మాణ పనులను. శనివారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశాన్ని లబ్దిదారులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా ఏఈలు చొరవ తీసుకోవాలన్నారు. ప్రతి లబ్దిదారునికి సిమెంట్, స్టీలు, ఇసుక అందజేయడం జరుగుతుందని, దీనిని వారు సద్వినియోగం చేసుకునేలా దృష్టి పెట్టాలన్నారు. ప్రతి లేఅవుట్‌కు సంబంధించిన లేఅవుట్ అధికారులు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని నిర్మాణాలు మరింత వేగవంతం అయ్యేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఇంకా బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్న నిర్మాణాలు వేగవంతం అయ్యేలా సంబంధిత లేఅవుట్ అధికారులు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ డీఈ దయాకర్ గృహ నిర్మాణ శాఖ ఏఈ మాధవయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లుతదితరులు ఉన్నారు.

## సచివాలయం తనిఖీ చేసిన కమీషనర్



**నెల్లూరు కార్పొరేషన్, జూలై 22, ప్రభాతవార్త** నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని స్థానిక 35/2 బషీర్ నగర్ వార్డు సచివాలయాన్ని కమీషనర్ వికాస్ మర్మత్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో ఇన్‌స్పెక్షన్ రిజిష్టరు, నోటీసు బోర్డు, హాజరు రిజిష్టరు, స్పందన రిజిష్టర్లతో పాటు వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించారు. జగనన్న సురక్ష కార్యక్రమ ఏర్పాట్లను అన్ని సచివాలయాల్లో ప్రణాళికబద్ధంగా నిర్వహించాలని, జగనన్న సురక్ష పథకం పారదర్శకంగా అందరికి చేరువయ్యేలా సచివాలయం సెక్రటరీలు కృషి చేయాలని అని సూచించారు. సచివాలయంలో పెండింగ్‌లో ఉన్న సేవలను గడువులోగా పూర్తి చేయాలని, సాంకేతిక అంశాలపై కార్యాలయం నుంచి నేరుగా సూచనలు పొందాలని సచివాలయాల కార్యదర్శులకు కమీషనర్ సూచించారు. ఎస్‌డీజీ సర్వే, భూ హక్కు, సర్వే, ఏపీ సేవా పోర్టల్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, సూచించిన యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలని తెలిపారు. అదే విధంగా స్పందన, జగనన్నకు చెబుదాం ఫిర్యాదులు, నాడు-నేడు పనుల పురోగతి, ఆస్తి పన్ను, యూజర్ ఛార్జీల వసూళ్లను సచివాలయ కార్యదర్శులు వేగవంతం చేయాలని సూచించారు. ప్రజలకు అందించే సేవల్లో నిబద్ధత పాటించాలని, తమకు నిర్దేశించిన పన్నుల వసూళ్ల లక్ష్యాలను గడువులోపు అందుకోవాలని సూచించారు. జగనన్న కాలనీ లే అవుట్ల నిర్మాణం పనులను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆమెనిటీస్ కార్యదర్శులను కమీషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సభ్య సమాజం తలదించుకునేలా జగన్ వ్యాఖ్యలు




**నెల్లూరు జూలై 22, ప్రభాతవార్త-వైద్యం** వెంకటగిరి అధికారిక సభలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చంద్రబాబు, లోకేష్, పవన్‌కళ్యాణ్‌లపై చేసిన వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించాడు. శనివారం నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కేంద్ర కార్యాలయంలో సోమిరెడ్డి విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభలో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వాలంటీర్లు, బాలికలు, మహిళలు ఉండగా వివాహాల గురించి హీనాతిహీనంగాఇ మాట్లాడడం దారుణమన్నారు. వెంకటగిరిలో పెట్టిన సభకు రూ.10కోట్లు ప్రజాధనం మీతాత సొత్తు అనుకుంటున్నావా, అధికారిక సభలో రాజకీయాలు మాట్లాడుతారాన్నారు. జగన్‌రెడ్డి ముఖాన్ని చూసేందుకు ప్రజలు రాకపోతే మూడు జిల్లాల నుంచి తరలించేందుకు ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలను వందల సంఖ్యలో పెట్టారని ఆయన ఆరోపించారు. రెండు రోజుల కూలీ ఇస్తామని ఉపాధి కూలీలనే తరలించారన్నారు. ఒక అధికారిక కార్యక్రమంలో స్థాయి దిగజారి మాట్లాడడం ఏ సీఎం ఇప్పటి వరకు చెయ్యలేదన్నారు. వైసీపీ మళ్ళీ అధికారంలోకి రావడం అసాధ్యమన్నారు. పవన్ ఎన్ని పెళ్ళిళ్ళులు చేసుకుంటే నీకెందుకని, నీ వైఎస్ వెంటకరెడ్డికి ఇద్దరు భార్యలని వారిలో రెండో భార్య మునిమనవడు నువ్వా కాదా జగన్ అని సూటిగా ప్రశ్నించాడు. పరదాల మధ్యలో వచ్చే జగన్‌కి ప్రాణభయం ఎందుకని, 2వేలమంది పోలీసులు కాపాలా అవసరమాన్నారు. దేశంలో ఎందరో ప్రధానులుగా, మంత్రులుగా పనిచేశారని, వారు ప్రజల్లో స్వేచ్ఛగా తిరిగేవారన్నారు. మోదీ కర్ణాటక ఎన్నికల్లో ఆరుసార్లు రోడ్డుషోలు, 19 బహిరంగ సభలతో ప్రజల మధ్యే ఉన్నారన్నారు. బ్రిటీష్ పాలకుల పరిపాలన నేటి ఏపీలో నెలకొందన్నారు. అప్పటి బ్రిటీష్ పాలకుడు లార్డ్‌మౌంట్ బాటన్ వీధుల్లోకి వస్తే ప్రజలు ఎవరూ బయటకు రాకూడదని, వచ్చినా వెనక్కి తిరిగి నిలుచోవాలనే నిబంధన ఉందని ఇప్పుడు జగన్ పాలనలో దానిని చూస్తున్నామన్నారు. జగన్ తనకు జెడ్‌ప్లస్ కేటగిరి భద్రత ఉందనుకుంటున్నారా, ప్రాణాలకు ముప్పు ఉందని హెచ్చరికలు ఏమైనా ఉన్నాయన్నారు. అప్పట్లో అశోకుడు చెట్లునాటిగే జగన్ ఇప్పుడు చెట్లు నరికేస్తున్నాడన్నారు. పర్యావరణాన్నే అంతమొందిస్తున్న ఏకైక వ్యక్తి జగనే అయి ఉండొొచ్చన్నారు. చంద్రబాబునాయుడు, రాజశేఖర్‌రెడ్డి, ఒకే వయస్సువారని ,ఈరోజు ఆయన బ్రతికి ఉంటే రాజశేఖర్ నువ్వు ముసలోడి అయిపొయ్యావు ఇక రాజకీయాలకు పనికిరావని దూరంగా పెట్టేవాడివాని నిలదీశాడు. వైఎస్ వివేకా హత్యకేసులో సీబీఐ దాఖలు చేసిన చార్జిషీటును చూసిన తర్వాత సీఎం జగన్‌రెడ్డి ఒక్క పూట కూడా ఆ సీటులో కూర్చోకూడదన్నారు. రాజకీయ నేపథ్యంలో తమ చిన్నాన్న హత్య జరిగిందని, తమ ఇంట్లో కోల్డ్‌వార్ జరుగుతోందని సాక్షాత్తు సీఎం చెల్లెలు షర్మిల ఇచ్చిన స్టేట్‌మెంటు బయటకు వచ్చిన తరువాత ఆ సీఎం సీటులో ఒక్క క్షణం కూర్చునే అర్హత జగన్‌కి లేదన్నారు. మూలధనం వ్యయంలో బీహార్‌లో 90శాతం, ఈశాన్య రాష్ట్రాల్లో 60 నుంచి 70శాతం ఏపీలో మాత్రం 23శాతం అంటే జగన్ పాలన ఎంత దరిద్రంగా ఉందో ఇట్టే అర్ధం చేసుకోవచ్చన్నారు. నీకు దమ్ముంటే అవినాష్‌రెడ్డి ఎంపీ పదవికి రాజీనామా చేయించాలని జగన్‌కి సవాల్ విసిరారు.

## పవన్‌కళ్యాణ్‌పై ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు తగవు




**కావలి, జులై 22 ప్రభాతవార్త** జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌పై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు తగవని మరలా ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే తీవ్ర పరిణామాలు వుంటాయని జనసేన పార్టీ నాయకులు హెచ్చరికలు చేశారు. కావలి పట్టణ రైల్వే రోడ్డులోని జర్నలిస్ట్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జనసేన పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ అళహరి సుధాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సమ్మెను వెంకట సుబ్బయ్య, నియోజకవర్గ అధికార ప్రతినిధి రుషికేష్, పట్టణ అధ్యక్షులు సాయి విఠల్‌లు మాట్లాడారు. 16 నెలలు జైలు జీవితం అనుభవించి వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి మా నేత పవన్‌క ళ్యాణ్‌పై విమర్శించడం సిగ్గు చేటన్నారు. పవన్‌కళ్యాణ్ మూడు పెళ్ళిళ్ల చేసుకుంటే రాష్ట్ర ప్రజలకు లేని ఇబ్బంది జగన్మోహన్‌రెడ్డికి వచ్చిన ఇబ్బందులు ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. వాలంటీర్లు సేకరిస్తున్న సమాచారం హైదరాబాద్ నానక్‌రామ్ గూడాలో ఎఫ్ఓఎ అనే కంపెనీకి చేరుతున్న విషయం నిజం కాదా అన్నారు. వాలంటీర్లు సేకరిస్తున్న డేటా దుర్వినియోగమైతే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. వీటిని ప్రశ్నించిన పవన్‌కళ్యాణ్‌కు సమాధానం చెప్పలేక జగన్మోహన్‌రెడ్డి, వాళ్ళ మంత్రులు చిల్లర మాటలు మా ట్లాడుతున్నారని దుయ్యబట్టారు. బెంగుళూరు ప్యాలెస్‌లో జగన్మోహన్‌రెడ్డి చేసిన రాసలీలలు, అరాచకాలు అందరికి తెలుసునన్నారు. రాష్ట్రంలో నయాపైసా అభివృద్ధి లేదు కానీ గ్రావెల్, ఇసుక, మద్యం మాఫియా మాత్రం జరుగుతుందన్నారు. పవన్‌కళ్యాణ్ చేపట్టిన వారాహి యాత్ర ప్రజలలో విశేష స్పందన వస్తుందన్నారు. దీంతో పవన్‌కళ్యాణ్‌పై కేసులు పెట్టి అరెస్ట్ చేయాలని చూస్తున్నారన్నారు. జగన్మోహన్‌రెడ్డి అరెస్ట్ చేసే ముందు లక్షలాది మంది జనసైనికులను అరెస్ట్ చేయాలన్నారు. నీ ప్రభుత్వానికి సమయం దగ్గరపడిందని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో పవన్‌కళ్యాణ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేది ఖాయమని తెలిపారు. పవన్‌కళ్యాణ్ ఫ్యాన్స్ పట్టణ అధ్యక్షుడు ఆలా శ్రీనాథ్, నాగార్జున, రఘు, ప్రవీణ్‌కుమార్, ఆది, మహేంద్ర, ప్రసాద్ పాల్గొన్నారు.

## జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్దిదారులకు 896 సర్టిఫికేట్లు అందజేత



**కావలి, జులై 22 ప్రభాతవార్త** కావలి పట్టణం వాయినందన ప్రెస్ వీధిలోని సచివాలయంలో శనివారం 33,37 వార్డులకు సంబంధించి 33వ వార్డు వైసిపి ఇన్‌చార్జ్, మాజీ కౌన్సిలర్ అమరా వేదగిరి సుబ్బ రాయుడు గుప్తా ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కావలి మున్సిపల్ కమిషనర్ కిరణ్ ముఖ్యఅతిధిగా పాల్గొని లబ్దిదారులకు 896 సర్టిఫికేట్లు అందజేశారు. అనంతరం కమిషనర్ జగనన్న సురక్ష కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలకు అవసర మైన సర్టిఫికేట్లు ఈ కార్యక్రమం ద్వారా అందజేస్తామన్నారు. వైసిపి నేతలు పొనుగోటి అనూరాధ, దామిశెట్టి శ్రీనివాసులనాయుడు, వెంకారెడ్డి, గుడ్లూరు మాల్యాద్రి, సురేష్‌రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి బాబురావు, వార్డు కన్వీనర్లు పెసల వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, వాలంటీర్లు అబ్దుల్ రెహమాన్, కాసుల విజయ, పల్నాటి శిరీష, రసపుత్ర మౌలిక, పట్నం జయంతి, దారా శ్రీకాంత్, ఆనాల కవిత, బండారు మల్లేశ్వరి, మంద జగదీష్, యనమల చైతన్య, కళ్యాణి, గృహ సారధులు పైడా లక్ష్మీపతి, కాసా విజయ్, గుంట్ల చంగల్‌రావు, గురజాల శ్రీవాణి, పసుపులేటి నరసింహ, భైరవరపు సునీత, దారా సునీత, మంచికలపాటి లక్ష్మీ సాయి, దంతంశెట్టి సుబ్రమణ్యం, వెలుగూరి ఈశ్వర్, నవీన్‌కుమార్, చెక్క మాల్యాద్రి, ఆనాల బ్రహ్మేశ్వర రావు, గతం సుబ్బారావు, మెంటా సత్యనారాయణలు పాల్గొన్నారు.

## వరిగొండలో జగనన్న సురక్ష



**తోటపల్లిగూడూరు, జూలై 22, ప్రభాతవార్త** మండలంలోని వరిగొండ బిట్టు -2వ సచివాలయం పరిధిలో శనివారం గూడూరు విష్ణుమోహన్‌రెడ్డి నేతృత్వంలో స్థానిక సర్పంచ్ ఈగ సుబ్బరత్నమ్మ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష సర్వే కార్యక్రమం నిర్వహించి సర్టిఫికేట్లు పంపిణీ చేశారు. నెల్లిపూడి సునీల్‌రెడ్డి, మండల వైకాపా కన్వీనర్ ఉప్పల శంకరయ్య గౌడ్, సచి వాలయాల కమిటీ కన్వీనర్ తలమంచి సురేంద్రబాబు తమ తమ సందేశాలలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వైకాపా నేత కోట శేఖర్‌రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ నైపుణ్య కమిటీ సభ్యులుగా ఎంపికైన సందర్భంగా ఆయనను స్థానిక నేతలు, అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, జడ్పీటీసీ శేషమ్మ, శ్రీజ్వాలాముఖి, దేవస్థానం చైర్మన్ కోసూరు రవీంద్రయ్య, ఉపసర్పంచ్ జలదంకి హరిప్రసాద్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు స్థానికులు పాల్గొన్నారు.

## విజయవంతంగా హెర్నియా శస్త్రచికిత్స

**నెల్లూరు జూలై 22, ప్రభాతవార్త-వైద్యం** పదిహేను ఏళ్ళుగా పెరిగి ప్రాణాంతకంగా మారిన హెర్నియా శస్త్రచికిత్స ను నారాయణ ఆసుపత్రి వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స చేశారు. శనివారం నారాయణ ఆసుపత్రిలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి జనరల్ సర్జరీ విభాగంలోని ప్రొఫెసర్ డాక్టర్ కెవెల్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ సాధారణంగా హెర్నియా వ్యాధి వచ్చినప్పుడు ఆపరేషన్ చేయించుకోవాల్సి వస్తుందని, అయితే సూళ్ళూరుపేట మండలం కోళ్ళమిట్టకు చెందిన చల్లప్ప అనే 72 ఏళ్ళ వృద్ధుడు గత 15 ఏళ్ళుగా హెర్నియా సమస్యతో బాధపడుతూ బాగా ముదిరి, విపరీతమైన కడుపు నొప్పితో ఇక్కడకు రావడం జరిగిందన్నారు. వెంటనే ఆయనకు అత్యవసర పరీక్షలు నిర్వహించి కడుపులో పేగులు జారిపోయాయని పరీక్షలు తేలిందన్నారు. ఆపరేషన్ చేసేందుకు ఆ వృద్ధుడు అనుకూలంగా ఉండడంతో ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించి ఆయన ప్రాణాలను కాపాడగలిగామన్నారు. చైతన్యకుమార్ మాట్లాడుతూ హెర్నియా అంటే పేగు జారడమని దానిని తొలిదశలోనే ప్రాథమిక చికిత్స తీసుకుంటే త్వరగా తగ్గిపోతుందన్నారు. అయితే ఈ రోగి 15ఏళ్లపాటు చికిత్స తీసుకోకపోవడంతో పేగులు మోకాళ్ళ వరకు జారిపోయాయన్నారు. ఆరోగ్యశ్రీ కింద ఆయనకు శస్త్రచికిత్స చేశామన్నారు. నారాయణ మెడికల్ సూపరింటెండెంట్ బి హరిప్రసాద్, జనరల్ సర్జరీ వైద్యులు ప్రణీత్, రంగస్వామి పాల్గొన్నారు.

## బూత్ కమిటీలపై దృష్టి సారించండి

**నెల్లూరు జూలై 22, ప్రభాతవార్త-వైద్యం** రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, బూత్ కమిటీలపై ప్రత్యేక దృష్టి సారించాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయంలో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి 25, 36, 37, 38, 41 డివిజన్ల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ కమిటీలను పక్కా ప్రణాళికతో నిర్మించుకుందామని, ప్రజలకు, తనకు మధ్య వారధులు బూత్ కమిటీ సభ్యులన్నారు. స్థానిక ప్రజలతో బూత్ కమిటీ సభ్యులు చక్కటి సమన్వయంతో మెలగాలని కోరారు. రేపటి ఎన్నికలకు ప్రాణం, శ్వాస బూత్ కమిటీ సభ్యులేనన్నారు. టీడీపీని బలోపేతం చేయడమే మన ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని వారిని కోరారు. పటిష్టమైన నిర్మాణమే మన ధ్యేయమని శ్రీధర్‌రెడ్డి అన్నారు. కొత్త, పాత అనే తేడా లేకుండా సమిష్టిగా పనిచేసి రూరల్‌లో టీడీపీ గెలుపుకి నాంది పలకాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర పార్టీ కార్యదర్శి జన్ని రమణయ్య, రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి మాతంగి కృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి పఠాన్ సాబిర్‌ఖాన్, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నావూరు శైలేంద్రబాబు, ఊరందూరు సురేంద్రబాబు, షంషుద్దీన్, బ్రహ్మారెడ్డి, అద్దంకి కృష్ణ, నాగేశ్వరరావు, బాపనపల్లి శశిధర్, చెంగలపట్టు శేఖర్, చల్లా భాస్కర్, ఒంటేరు శ్రీనివాసరావు, టిఎస్ శ్రీనాథ్, వడ్లమూడి రమేష్, జలదంకి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిని ఆశీర్వదించండి

**వలేటివారిపాలెం జూలై 22, ప్రభాతవార్త** ముఖ్యమంత్రి జగనన్న ప్రభుత్వంలో కందుకూరునియోజకవర్గంలో స్దానిక శాసనసభ్యులు ఎం.మహీధర్‌రెడ్డి నేతృత్వంలో ప్రతి ఇంటికి సుమారు రూ.2 లక్షల నుంచి 6లక్షల వరకు వివిధ పథకాల ద్వారా లబ్దిచేకూరిందని స్దానిక ఎంపీపీ పి.మౌనిక, జెడ్పీటీసీ ఇంటూరి భారతిలు అన్నారు. ఈ నేపద్యంలో అరు హ్వాలందరికి ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి జగనన్నను, కందుకూరు నియోజకవర్గంలో ఒంటిచేత్తో సుపరిపాలనను అందిస్తున్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో ఆశీర్వదించాలని వారు పేర్కొన్నారు. శనివారం వలేటివారిపాలెం మండల కాంప్లెక్స్ ఆవరణలో ఎంపీడీవో రఫీక్ అహ్మద్ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ మౌనిక, జెడ్పీటీసీ భారతి, తహసిల్దార్ కెవిబిటి.సుందరమ్మ, సర్పంచ్ గురిజాల కిష్టయ్య, వైసీపీమీడియా ప్రతినిధి పరిటాల వీరాస్వామి, జేసీఎస్ కన్వీనర్ అనుమోలు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నేతలు అనుమోలు వెంకటేశ్వర్లు, ఇంటూరి హరిబాబు, కట్టా హనుమంతరావు, గుత్తా ఆంజనేయులు, కట్టా అంజయ్య, వలేటి మాల్యాద్రి తదితరులు ఉన్నారు. సభాప్రాంగణంలో ఏర్పాటుచేసిన వైద్యశిబిరంలో ఏఎన్ఎం రత్నకుమారితోపాటు పలువురు ఆషావర్కర్లు పాల్గొన్నారు. పలువురు లబ్దిదారులకు పలు ధృవపత్రాలను అందచేశారు.

## చికిత్సపొందుతున్న బాధితునికి కాకర్ల ఆర్ధికసాయం



**వింజమూరు, జులై22ప్రభాతవార్త:** మండలంలోని ఊటుకూరు పంచాయతీ పరిధిలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన కందికట్టు చెంచురత్నం అనారోగ్యంతో చెన్నై హాస్పిటల్లో చికిత్స పొందుతు న్నా డు. బాధితుని ఆరోగ్యం గురించి జిల్లా యానాదిసంఘం ఉపాధ్యక్షుడు రాగి సుబ్బయ్య కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ దృష్టికి తీసుకెళ్ళగా స్పందించిన సురేష్ ట్రస్ట్ ప్రతినిధుల ద్వారా 15వేల రూపాయల ఆర్థికసాయాన్ని చెన్నైకి వెళ్ళి బాధితునికి అందజేశారు. ఆపదలో ఆదుకున్న కాకర్ల సురేష్‌కు బాధితుని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఈనెల 26న ఆత్మకూరు, కావలి నియోజకవర్గాల సమీక్షా సమావేశాలు

**నెల్లూరు అర్బన్, జూలై 22, ప్రభాతవార్త** కావలి, ఆత్మకూరు అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షా సమావేశాలు ఈనెల 26న నెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అంబటి రాంబాబు అధ్యక్షతన జిల్లాకు చెందిన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి, ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేల సమక్షంలో జరిగే ఈ సమీక్షా సమావేశాలకు జిల్లాస్థాయి అధికారులు అందరూ పూర్తి సమాచారంతో హాజరు కావాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈనెల 26వ తేదీ ఉదయం 10గంటలకు ఆత్మకూరు అసెంబ్లీ నియోజకవర్గ సమావేశం, మధ్యాహ్నం 3గంటలకు కావలి అసెంబ్లీ నియోజకవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లాస్థాయి, ఆయా నియోజకవర్గాల మండల స్థాయి అధికారులు, తమ శాఖలకు సంబంధించిన పూర్తి వివరాలతో సమావేశాలకు హాజరు కావాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## జగన్‌రెడ్డి అభివృద్దిని విస్మరించి పవన్‌కళ్యాణ్‌పై వ్యక్తిగత వ్యాఖ్యలు సహించం



**కావలి, జులై 22 ప్రభాతవార్త** ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అభివృద్దికి స్వస్తి చెప్పి పవన్‌కళ్యాణ్‌పై వ్యక్తిగత విమర్శలు చేస్తే ఇక సహించేది లేదని కావలి జనసేన పార్టీ నాయకులు యం.వి.సిద్దు, తోట వెంకట శేషయ్యలు హెచ్చరికలు చేశారు. సియం వ్యాఖ్యలను ఖండిస్తూ శనివారం కావలిలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో వారు మాట్లాడారు. వెంకటగిరిలో నేతన్న నేస్తం కార్యక్రమంలో పవన్‌కళ్యాణ్‌పై జగన్‌రెడ్డి దిగజారుడు వ్యాఖ్యలు చేసాడని దుయ్యబట్టారు. పవన్‌కళ్యాణ్ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పే దమ్ము, ధైర్యం లేక జగన్ చెత్తచెత్తగా మాట్లాడుతున్నారన్నారు. ఆయనలాగే మేము కూడా దిగజారి మాట్లాడగలమని హెచ్చరికలు చేశారు. సంస్కారం వుండబట్టే హద్దుల్లో మాట్లాడుతున్నామన్నారు. వాలంటీర్లు సేకరిస్తున్న సమాచారమంతా హైదరాబాద్ నానక్‌రామ్ గూడలోని ఎఫ్‌వోఎ కంపెనీలో ఎందుకు వుందో జగన్‌రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. వాలంటీర్లలో కొంతమంది మహిళలు, మైనర్ బాలికలపై అత్యాచారాలు చేయడం, వేధింపులకు గురిచేయడం, వివాహితులు కాపురాలు కూల్చడం నిజంకాదా అని ప్రశ్నించారు. వాలంటీర్ల ద్వారా సేకరిస్తున్న డేటా దుర్వినియోగమవుతుంటే ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. ప్రతి వ్యక్తి ఆధార్, బ్యాంక్ వివరాలు, సోషల్ మీడియా అకౌంట్, ఎవరు ఎక్కడికి ఏ పని మీద వెళ్తున్నారు, అవివాహిత మహిళలు, ఒంటరి మహిళలు, యువతుల వివరాలు, వారి ఫోన్ నెంబర్లు సేకరిస్తున్న మాట నిజం కాదా ప్రశ్నించారు. రాష్ట్రంలో మహిళలు అదృశ్యమవుతున్న దారుణ విషయాల్ని పవన్‌కళ్యాణ్ ప్రస్తావించడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని మరుగన పెట్టేందుకే జగన్‌రెడ్డి చెత్త మాటలు మాట్లాడుతున్నాడన్నారు. జగన్ జీవితం పట్ల కూడా తాము కూడా మాట్లాడగలమన్నారు. తండ్రి చనిపోయినప్పుడు జగన్ ఎక్కడ, ఎవరి దగ్గర వున్నాడు, కలకత్తాలో వున్న మాట వాస్తవం కాదా అని తెలిపారు. బెంగుళూరు ప్యాలెస్‌లో చేసిన అరాచకాల చిట్టా అందరి తెలిసిన విషయమేనన్నారు. అక్కడి రాసలీలలు గురించి వైసిపి మంత్రుల వ్యవహారాలు, ఈ అరాచకాలు బయటకు వస్తాయని భయంతో కర్ణాటక ఎన్నికలలో ఆ రాష్ట్ర కీలక కాంగ్రెస్ నాయకుడుకి ఎన్నికల ఫండ్ పేరుతో ఎన్ని వందల కోట్లు పంపించాడు, ఆ డబ్బులు తీసుకెళ్లిన ఉన్నతాధికారిని కూడా త్వరలో బయటపెడతామని హెచ్చరికలు చేశారు. తల్లిని, చెల్లిని బయటకు గెంటేసిన వ్యక్తి కూడా నీతులు చెప్పడం ఏమిటని ఎద్దేవ చేశారు. జగన్‌రెడ్డి ఓటమి ఆయన కళ్ళ ముందు కనిపిస్తుందని అందువల్లే ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన రూరల్ అధ్యక్షులు తిరుపతిస్వామి, పుల్లయ్య, సురేంద్ర, జనసేన నాయకులు మనోజ్, తోట సాయి, మల్లి, సలీం, తిరుపతి, శశి, సుకుమార్, జోషి తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబుని ముఖ్యమంత్రి చేయడమే మహాశక్తి ధ్యేయం



**కావలి, జులై 22 ప్రభాతవార్త** రానున్న ఎన్నికలలో నారా చంద్ర బాబునాయుడుని ముఖ్యమంత్రిగా గద్దెనెక్కించడమే మహాశక్తి ధ్యేయమని టిడిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు తెలిపారు. తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన మహాశక్తి కార్యక్రమాన్ని శనివారం మాలేపాటి ఆధ్వర్యంలో తెలుగు మ హిళలు అట్టహాసంగా ప్రారంభించారు. కావలి మున్సిపాల్టీ పరిధిలోని మద్దూరుపాడులోని ఆంజనేయస్వామి ఆలయంలో మాలేపాటి మహిళలతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలకు ఏర్పాటు చేసిన మహాశక్తి వాహనంలో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. మహిళలతో కలిసి రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాలేపాటి నాయకత్వం, మహాశక్తి వర్ధిల్లాలంటూ మహిళలు నినాదాలు చేశారు. చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టోపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. క్రిమినల్స్ అందలం ఎక్కితే మహిళలకు రక్షణ ఎలా వుంటుందని ప్రశ్నించారు. ఈసారి మహిళా శక్తితో తెలుగుదేశం పార్టీని గెలిపించుకోవడం ఖాయమని ధీమాను వ్యక్తం చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలంటూ ప్రజలు దీవిస్తూ ఆశీర్వదించిన పసుపుతాడులను మహాశక్తిలోని మహిళలకు అందజేశారు. టిడిపి పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు ద్రోణాదుల వాసంతి, కొల్లురు అశ్వని, పసుపులేటి పద్మ, రాధమ్మ, కట్టమూరు శ్రీదేవి, బత్తమ్మ, సుప్రజ, శ్రీలక్ష్మి, అమరజ్యోతి, మద్దూరుపాడు టిడిపి నేతలు కొండా వెంకట్రావు, కొమర వెంకటేశ్వర్లు, పిలిమెట్ల సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

## అర్హతే ప్రమాణికం జగనన్న సురక్ష లక్ష్యం



**విం జ మూరు, జులై 22 ప్ర భా త వా ర్త** రాష్ట్రంలోని అర్హత కలిగిన ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష పథకం లక్ష్యమని మండల ఉపాధ్యక్షుడు ఆనంగి రమణయ్య పేర్కొన్నారు. శనివారం వింజమూరు పంచాయతీ పరిధిలోని కొత్తూరు సచివాలయంలో సర్పంచ్ నల్లగొండ్ల సృజన అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందిస్తున్న జగన్మోహన్‌రెడ్డిని రాష్ట్ర ప్రజలు మరోసారి ఆశీర్వదించి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. జగనన్న సురక్ష పథకం ప్రారంభించేందుకు ముందుగా సచివాలయ పరిధిలోని ప్రతి ఇంటిని వాలంటీర్లు , సచివాలయ సిబ్బంది సందర్శించి అర్హత ఉండి పథకాలు రాకుంటే వారి వివరాలను నమోదుచేసుకొని సంక్షేమ పథకాలు అందించేలా చర్యలు చేపడుతున్నా న్నారు. 11రకాల సర్టిఫికేట్లను అందించేందుకు సచివాలయ , రెవెన్యూ సిబ్బంది సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రతి ఒక్కరూ ఈ జగనన్న సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి ఇళ్ళు సంక్షేమ దిశగా అడుగులు వేయాలని కోరారు. ఈకార్యక్రమంలో తహసిల్దార్ చొప్పా రవీంద్రబాబు, ఎంపిడిఓ రాజేష్‌బాబు, ఎంఇఓ మధుసూధన్‌రెడ్డి, ఇఓపిఆర్‌డి శ్రీనివాసులు, ఉపసర్పంచ్ మిడదాల జయలక్ష్మి , వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే నా ధ్యేయం



**వింజమూరు, జులై22ప్రభాతవార్త:** ఉదయగిరి నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని ఉదయగిరి వైఎస్ఆర్‌సిపి ఇన్‌చార్జ్ మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని కాటేపల్లి పంచాయతీ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక బిసి కాలనీలో ఇంటింటికి తిరుగుతూ జగనన్న ప్రవేశపెట్టిన పథకాల అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు దేశంలోఎక్కడా ఇన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన దాఖలాలు లేవన్నారు. జగనన్న గడిచిన నాలుగు సంవత్సరాల్లో నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు , సమన్వయకర్తలకు, ఇన్‌చార్జ్‌లకు స్పష్టమైన ఆదేశాలు అందించి ప్రతి ఇంటికి వెళ్ళి, ప్రతి గడపకు వెళ్ళి ప్రజల యోగక్షేమాలతోపాటు సంక్షేమ పథకాల గురించి తెలియజేయాలన్నారు. నిఅనంతరం వన్నూరుపాళెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో జడ్పీటిసి సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి, ఎంపిపి ఇనగనూరి మోహన్‌రెడ్డి, ఎంపిటిసి సభ్యులు పల్లాపురుషోత్తం, మాజీ ఎంపిపి కృష్ణకిరణ్‌రెడ్డి, మాజీ కన్వీనర్ , వైసిపి నాయకులు గువ్వల కృష్ణారెడ్డి, కన్వీనర్ రేవనూరు శ్రీనివాసులురెడ్డి, మాజీ కన్వీనర్లు మద్దూరు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, మలిరెడ్డి విజయకుమార్‌రెడ్డి, సొసైటీ మాజీ చైర్మెన్ మద్దూరి చిన్ని కృష్ణారెడ్డి, స్థానిక నాయకులు మందాది గోవిందరెడ్డి, బండి కృష్ణారెడ్డి, అన్నపురెడ్డి శ్రీనివాసులురెడ్డి, నీలం సంజీవరెడ్డి, బయపురెడ్డి విజయకృష్ణారెడ్డి, ఎంపిటిసి సభ్యులు చల్లా పురుషోత్తం, బొరెడ్డి సాంబశివారెడ్డి, చంద్రారెడ్డి, ఓబులురెడ్డి, మందాది గురుప్రసాద్‌రెడ్డి, మద్దూరు బాలకృష్ణారెడ్డి, బొరెడ్డి గంగాధర్‌రెడ్డి, మందాది బ్రహ్మారెడ్డి, ఎంపిడిఓ రాజేష్‌బాబు, ఆర్ఐ శిరాజ్, హౌసింగ్ ఎఇ మహేష్, ఎస్ఐ కోటిరెడ్డి , సోషల్‌మీడియా ఇన్‌చార్జ్‌లు అంకినపల్లి నర్సింహారెడ్డి, జిలానీ, సుధాకర్‌రెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న సురక్ష తో సమస్యలు పరిష్కారం



**వరికుంటపాడు, జూలై 22, ప్రభాతవార్త** : జగనన్న సురక్ష కార్యక్రమముతో సమస్యలు పరిష్కారం అవుతాయనీ జెడ్పిటిసి సభ్యుడు రావెళ్ళ నాగేంద్ర అన్నారు. రామాపురం సచివాలయం పరిధిలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమములో స్థానిక వైసిపి నేత చెన్నారాయుడు మాట్లాడుతూ తమ గ్రామము పరిధిలో 4 జగనన్న లేఅవుట్లను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, అందులో ఒకటి కోర్టుపెండింగ్ లో ఉందని మిగిలిన వాటిలో ఎలాంటి మౌళిక వసతులు కల్పించకుండానే అధికారులు గృహాలు నిర్మించాలంటూ హడావుడి చేస్తున్నారంటూ అసహనాన్ని వ్యక్తం చేశారు. జెడ్పిటిసి సభ్యుడు రావెళ్ళ నాగేంద్ర మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా అందజేస్తున్నారన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు సచివాలయ వ్యవస్థ, వాలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చారని కొనియాడారు. మండలంలో ఇప్పటి వరకు సుమారు ఆరు వేల మందికి అనేక రకాల ధృవీకరణ పత్రాలను అందించిన ఘనత వైకాపా ప్రభుత్వం కే చెందుతున్నారు. అనంతరం 281 మంది వివిధ రకాల ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమములో ఎంపిడిఓ విజయ్ భాస్కర్ రావు, తహశీల్దార్ సయ్యద్ ఇక్బాల్ , పంచాయతీ రాజ్ ఎఈ నందకిషోర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్ , పంచాయతీ కార్యదర్శి ప్రభుదాస్, విఆర్ఓ ఆంతోని బాబు, వైసిపి నేతలు రాయిల్ల మధు, తోడెందుల నరసింహరావు, సచివాలయ సిబ్బంది కిషోర్, కొండపనాయుడు, వెంకటేశ్వర్లు, సందిప్ , మేరి స్టేల్లా తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న సురక్షతో ప్రజలకు అవసరమైన సేవలు



**సైదాపురం జులై 22 ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష సర్వేద్వారా అర్హులైన ప్రజలకు అవసరమైన సేవలను ఉచితంగా అందించడం జరుగుతుందని మండల జెసిఎస్ కన్వీనర్ మన్నారపు రవికుమార్ తెలిపారు. మండలకేంద్రమైన సైదాపురం సచివాలయం -1 పరిధిలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిం చారు. ప్రజలకు అవసరమైన సేవలు నమోదు చేసుకొని వారికి ప్రజా ప్రతినిధులు సమక్షంలో అధికారులు ధృవీకరణ పత్రాలు అందించారు. మనా న్నరపు రవికుమార్ మాట్లాడుతు పేదలందరికి మరింత మేలు చేసేందుకే జగనన్న ఈకార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈకార్యక్రమంలో తహసిల్దారు ఎన్ శ్రీనివాసులు, ఎంపిడిఒ మీసాల వెంటకేశ్వర్లు, గ్రామ సర్పంచ్ వెందోటి శారదమ్మ, ఏఒ పురుషోత్తమ్ శివకుమార్, డిప్యూటి తహసిల్దారు అనురాధ, ఉపసర్పంచ్ బులిగర్ల శివకుమార్, పంచాయితీ కార్యదర్శిలు ఇంద్రాణి, జిలానీబేగ్, సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఉగ్రవాది జగన్



**నెల్లూరు జూలై 22, ప్రభాతవార్త-వైద్యం** రాష్ట్ర సీఎం జగన్ ఒక ఆర్థిక నేరగాడని తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పఠాన్ సాబిర్‌ఖాన్, చెముకుల కృష్ణ చైతన్యలు పేర్కొన్నారు. శనివారం నగరంలోని తెలుగు దేశం పార్టీ జిల్లా కేంద్ర కార్యాలయంలో వారు విలేఖరుల సమావేశం నిర్వహించారు. శనివారం నగరంలోని టీడీపీ జిల్లా కేంద్ర కార్యాలయంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. వెంకటగిరి నియోజకవర్గంలో ప్రభుత్వ కార్యక్రమంలో చంద్రబాబు, లోకేష్, బాలకృష్ణ, పవన్‌కళ్యాణ్‌లను సభ్య సమాజం తలదించు కునే లా మాట్లాడడం సరికాదన్నారు. రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేయాలో ఆలోచించాల్సి పోయి, ప్రతిపక్షాలను విమర్శించడం సరికాదన్నారు. ఇలాగే టీడీపీ నేతలను అసభ్య పదజాలంతో దూషిస్తే, జగన్‌కి టీడీపీ నేతలు, కార్యకర్తలు ధీటుగా సమాధానం చెపతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## పేదప్రజల సంజీవిని కాకర్ల సంజీవినీ ఆరోగ్య రథం



**కలిగిరి, జూలై22, ప్రభాతవార్త;** పేదప్రజలకు నిజమైన సంజీవినీ కాకర్ల ట్రస్ట్ ఏర్పాటు చేసిన సంజీవినీ ఆరోగ్యరథం అని పేద ప్రజలు కొనాయాడుతున్నారు. కాకర్లట్రస్ట్ అదినేత , టిడిపి నాయకులు కాకర్ల సురేష్ ఏర్పాటుచేసిన సంజీవినీ ఆరోగ్య రథంకు ప్రజలనుండి విశేష స్పందన లబిస్తుంది. ఉదయగిరి నియోజకవర్గం లోని అనేక ప్రాంతాల్లో ఈ ఆరోగ్య చైతన్య రథం తమ శేవలను విస్తృతం చేస్తూ పేద ప్రజలకు కారొరేట్ వైద్యాన్ని అందిస్తుంది. వైద్యశిబిరంలోనే అన్నిరకాల పరీక్షలు, ఇసిజి, బిపి, షుగర్‌లాటి పీక్షలుసైతం చేస్తూ పేదప్రజల మన్ననలు పొందుతుంది. ఈక్రమంలో శనివారం కలిగిరి మంలంలోని రాజుపాళెంలో ఉచిత వైద్యశేవలు అందించగా ఈ కార్య క్రమానికి సుమారు 120మందికివివద రకాలవైద్య పరీక్షలు, 74మందికి కంటిపరీక్షలుచేసినట్లు వైద్యశిబ్బంది తెలిపారు. వచ్చినవారికి అవసరమైన అన్నికరాల పరీఓలుచేసి మందులు అందజేశారు. ఈకార్యక్రమంలో డబ్బుగుంట బుజ్జియ్యపల్లవోలు చిన్న సుబ్బారెడ్డి, పందిళ్ల అశోక్, బెల్లంకొండసుదాకర్, వల్లూరి మాదవ, ఒంటేరు శ్రీకాంత్, వైద్యబృందం గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



**ఉలవపాడు, జూలై22, ప్రభాతవార్త** జగనన్న విద్యా కానుక రెండో విడత సెమిస్టర్2 పుస్తకాల పంపిణీలో భాగంగా మండల పరిధిలోని పెద్ద పట్టపుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్కూల్ కమిటీ చైర్మన్ వాయిల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులకు సెమిస్టర్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు సిహెచ్ శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## డంపింగ్ యార్డ్‌ను పరిశీలించిన సర్పంచ్



**వింజమూరు, జులై22ప్రభాతవార్త:** వింజమూరు పంచాయతీ పరిధిలోని జిబికెఆర్ ఎస్టీకాలనీలో చెత్తనుండి సందప కేంద్రాన్ని శనివారం జిబికెఆర్ ఎస్టీకాలనీలో సమీపంలోని చెత్తనుండి సంపద కేంద్రాన్ని సర్పంచ్ నల్లగొండ్ల సృజన, ఇఓపిఆర్‌డి శ్రీనివాసరావ్‌లు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీకి ఆదాయవనరుగా ఉన్న సంపదకేంద్రంపై దృష్టికేంద్రీకరిస్తున్నా మన్నారు. సంపదకేంద్రం చుట్టూఉన్న సువిశాలమైన మైదానాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు సంపద కేంద్ర పరిసరాల్లో ముళ్ళపొదలు , పిచ్చిమొక్కలను తొలగించేందుకు శ్రీకారం చుట్టామన్నారు. స్థానిక వార్డు సభ్యులు అంకోజమ్మ, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, సిబ్బంది వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సేవకుడు గణపం



**వింజమూరు, జులై22ప్రభాతవార్త:** శనివారం జడ్పీటిసి సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి జన్మదిన వేడుకలను ఘ నంగా నిర్వ హిం చారు. ఈసందర్భంగా మాజీ వైసిపి కన్వీ నర్ మలిరెడ్డి విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ జడ్పీటిసి స భ్యులు గణపం బాలకృష్ణారెడ్డి నిరంతరం ప్ర జా సేవకు డిగా, ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ అందరిలో ఒకడిగా కలిసిపోయే గొప ్ప మనసున్న వ్యక్తి అన్నారు. తన రాజకీయ ప్రయాణంలో ఎంతో పెద్ద స్థాయికి వెళ్ళాల్సిన వ్యక్తి అన్నారు. కులం, మతం, ప్రాంతం చూడకుండా ఎక్కడ సమస్య ఉంటే అక్కడికి వెళ్ళి సమస్య పరిష్కారానికి వెనువెంటనే కృషి చేస్తారన్నారు. రాజకీయాలకు అతీతంగాఆయన చేస్తున్న సేవలు నేటికీ ఆదర్శనీయమన్నారు. మరెన్నో జన్మదిన వేడుకలను జరుపుకోవాలని ఆకాంక్షించారు. బాలకృష్ణారెడ్డిచే కేక్‌ను కట్‌చేయించి సంబరాలు జరుపుకున్నారు. మాజీ ఎంపిపి గణపం కృష్ణకిరణ్‌రెడ్డి, చాకలికొండ ఎంపిటిసి సభ్యులు దేగా వంశీ, వైసిపి సోషల్ మీడియా టీమ్ మెంబర్లు శివారెడ్డి , జిలానీ, సాంబశివ పాల్గొన్నారు.

## విద్యార్దులకు సెకండ్‌సెమిస్టర్ బుక్స్ పంపిణీ



**బుచ్చి జూలై 22 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని ఎలిమింట్రీ స్కూల్ విద్యార్దులకు సెకండ్ సెమి స్టిరీ బుక్స్ పంపిణి చేశారు.పంచేడు గ్రామంలోని ఎలిమింట్రీస్కూల్ ప్రధానోపాధ్యాయులు సిహెచ్ ప్రభాకర్, ఉపాధ్యాయురాలు పి .ఈశ్వరమ్మవిద్యార్దులకు సెకండ్ సెమిస్టిరీ బుక్స్‌ను అందజేశారు.ఈ బుక్స్ 5 తరగతులకు అందజేసినట్లు ఆమె తెలిపారు.

## ఫ్యాన్‌కు ఓటేసిన పాపానికి ఇళ్లలో ఫ్యాన్ వేసుకోలేని దుస్థితి



**కోవూరు జూలై 22 ప్రభాతవార్త** : విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని ప్రమాణస్వీకార సభలో చెప్పిన జగన్ మోహన్‌రెడ్డి వాటిని తగ్గించకపోగా పెదనద ఎత్తున చార్జీలు పెంచి ఫ్యాన్ గుర్తుకు ఓటేసిన పాపానికి ఇళ్లలో ఫ్యాన్ వేసుకోలేని పరిస్థితిలో ప్రజలు ఉన్నారని జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లురెడ్డి అన్నారు. కోవూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మా ట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్రంలో కరెంటు కోతలు లేవు.. చార్జీల బాధుడు లేదన్నారు. 2014 నుంచి 2019 వరకు తెలుగుదేశం పార్టీ హయాంలో వాడుకున్న విద్యు త్‌కు కూడా నేడు వైసీపీ ప్రభుత్వంలో ట్రూఅప్ చార్జీల పేరిట వసూలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం నాడు విద్యుత్ చార్జీలు పెంచకపోయినా పెంచారని ప్రచారం చేసి నేను అధికా రంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ చార్జీలను పూర్తిగా తగ్గిస్తామని చెప్పడం వాస్తవం కాదా అన్నారు. ముఖ్య మంత్రి అయిన తర్వాత జగన్‌మోహన్‌రెడ్డి ఏడు సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై 17093 కోట్ల భారం మోపారన్నారు. ఈ ప్రభుత్వం ఏకంగా విద్యుత్ వినియోగదారుల నుంచి 3 రకాల ట్రూఅప్ చార్జీలను వసూలు చేస్తుంది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అదేవిధంగా పొరుగున ఉన్న తెలంగాణ రాష్ట్రంలో ట్రూ అప్ చార్జీలు 12718 కోట్లు వసూలు చేయాలని ఈఆర్‌సీ ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించినా కేసీఆర్ ప్రభు త్వం మాత్రం వాటిని వినియోగదారుల నుంచి వసూలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి విద్యుత్ చార్జీలను తగ్గించడంతో పాటు తెలంగాణ ప్రభుత్వం లాగా మన రాష్ట్రంలో కూడా ట్రూఅప్ చార్జీలను, ఇంధన సర్దుబాటు చార్జీలను ప్రభుత్వమే భరించాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు జె. రవికుమార్, ఐ. విజయ్, సోమా గోపాల్, వెంకటేశ్వర్లు, శివకుమార్, రాంబాబు, శ్రీహరి, వాహిద్, యశ్వంత్, భగవాన్, సురేష్, తదితరులు ఉన్నారు.

## ముఖ్యమంత్రి మేదస్సు నుంచి వెలువడే ప్రతి పథకం అద్భుతం



**కోవూరు జూలై 22 ప్రభాతవార్త** :అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ది చేకూర్చాలనే గొప్ప లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మంచి పాలన అందిస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు నిరంజన్‌బాబురెడ్డి అన్నారు. కోవూరు మండలం కోవూరు పంచాయతీ సచివా ల యం-3లో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రజల వద్దకే ప్రభుత్వం ఉండేలా ముఖ్యమంత్రి చర్యలు తీసు కోవడం జరిగిందన్నారువలంటీర్లు, గృహ సారధులు, సచివాలయ ఉద్యోగులు ప్రత్యేకంగా సమన్వయం చేసుకుని అర్హులందరినీ గుర్తించి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు వారికి అందిచేలా కృషి చేస్తున్నారన్నారు. ప్రజల వద్దకే పాలన ఉంచాలన్న మంచి ఆశయంతో ముఖ్యమంత్రి సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారన్నారు. కేవలం రోజుల వ్యవధిలోనే 11 రకాల సర్టిఫికేట్లను ప్రభుత్వ అధికారులే ప్రజల వద్దకే వెళ్లి వాటిని అందజేయడం జరుగుతుందన్నారు. గతంలో సర్టిఫికేట్ల కోసం లబ్దిదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉం డేదన్నారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ పథకాలు లబ్ది పొందాలంటే మధ్యవర్తులు గానీ, జన్మభూమి కమి టీలు గానీ సంప్రదించాల్సిన పరిస్థితి ఉండేది. ప్రస్తుతం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మధ్యవర్తుల ప్రమే యం లేకుండా సంక్షేమ పథకాలు నేరుగా లబ్దిదారుల ఖాతాల్లో జమ అవుతున్నాయన్నారు.ప్రజల సంక్షే మాన్ని, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని అర్హత కలిగిన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి మేదస్సు నుంచి వెలువడిన ప్రతి పథకం ఒక అద్భుతమన్ది కొనియాడారు. పాదయాత్రలో ముఖ్యమంత్రి చెప్పిన ప్రతి హామీని నెరవేరుస్తూ ముందుకు సాగుతున్నారన్నారు. రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ కరోనా సమయంలో తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా వలంటీర్లు చేసిన సేవలు నిరుపమానం అన్నారు. అటువంటి వారిని జనసేన నేత పవన్ కళ్యాణన అనుచిత వ్యాఖ్యలు చేయడం మంచి పద్దతి కాదన్నారు. గతంలో పింఛన్ల కోసం పంచాయతీ కార్యాలయం వద్ద ఉద యం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి. ప్రస్తుత జగన్ పాలనలో 1వ తేది వేకువ జామునే ఇంటి తలుపులు తట్టి మరీ పింఛన్లు అందిస్తున్నారన్నారు. వలంటీర్లను మిగతా రాష్ట్రాల వారు ప్రశంసిస్తుంటే కేవలం పవన్ కళ్యాణ్ మాత్రమే విమర్శిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వలంటీర్లకు పవన్ కళ్యాణ్ బేషరుతుగా క్షమాపణ చెప్పాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. అనంతరం సర్టిఫికేట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, వైస్ ఎంపీపీ నరసింహు లురెడ్డి, రాష్ట్ర బొందిలి కార్పొరేషన్ చైర్మన్ కిషోర్ సింగ్, ఎంపీటీసీ సభ్యులు రాజగోపాల్ ప్రసంగించారు. అనంతరం 11 రకాల ధృవీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీహరి, తహసీ ల్దార్ పద్మజ, సొసైటీ చైర్మన్ ఆర్. మల్లికార్జున్‌రెడ్డి, మండల సలహా మండలి చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, వైసీపీ నేతలు అత్తిపల్లి అనూప్‌రెడ్డి, జుబేర్‌బాషా, వెంకటరమణారెడ్డి, కృష్ణయ్య, ఉపసర్పంచ్ మైనుద్దీన్, సచివాల యాల కన్వీనర్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, సచివాలయ కార్యదర్శి రమేష్,సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఉన్నారు.

## ఎస్పీ నుంచి కోవూరు సీఐకు ప్రశంసలు



**కోవూరు జూలై 22 ప్రభాతవార్త :** కోవూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న కె. రామకృష్ణారెడ్డి.. జిల్లా ఎస్పీ డాక్టర్ తిరుమలేశ్వరరెడ్డి నుంచి ప్రత్యేక ప్రశంసాపత్రాన్ని పొందారు. కోవూరు సర్కిల్ పరిధిలో కేసుల పరిష్కారం పట్ల ప్రత్యేక చొరవ చూపి సకాలంలో వాటిని పరి ష్కరించడం పట్ల ఈ ప్రశంసాపత్రాన్ని కోవూరు సీఐ పొందారు. వీరితో పాటు కోవూరు ఎస్సై డి. వెంకటేశ్వ రరావు, హెడ్ కానిస్టేబుల్ సతీష్‌లు కూడా జిల్లా ఎస్పీ నుంచి ప్రశంసాపత్రాలు పొందారు. దీంతో వారిని కోవూరు సర్కిల్ కార్యాలయ పోలీసులు ప్రత్యేకంగా అభినందించారు.

## రీ సర్వే కార్యక్రమాలు మరింత వేగవంతం కావాలి



**కోవూరు జూలై 22 ప్రభాతవార్త** : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న భూ హక్కు- భూ సర్వేకు సంబంధించి ప్రస్తుతం చేపడు తున్న రీసర్వే ఆన్‌లైన్ నమోదు కార్యక్రమం మరింత వేగవంతం కావాలని కోవూరు తహసీల్దార్ ఎం. పద్మజ అన్నారు. కోవూరు మండలం పాటూరు గ్రామంలో జరుగుతున్న రీ సర్వే ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేపట్టే ఈ పనులు పారదర్శకంగా యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేలా సచివాలయ సర్వేయర్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి రమణమ్మ, సర్వేయర్లు ఉన్నారు.

## ఎన్ఎస్ఆర్ ట్రస్టు ద్వారా 3 బ్యాటరీ ట్రై సైకిళ్లు పంపిణీ



**కోవూరు జూలై 22 ప్రభాతవార్త :** కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డ ఇటీవల గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా గంగవరం కోవూరు ప్రాంతాల్లో పర్యటించిన సందర్భంగా ముగ్గురు దివ్యాంగులు తమకు ట్రై సైకిళ్లు కావాలని ఆయన దృష్టికి తీసుకువచ్చారని, ఇందుకు స్పందించిన ఆయన తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా లక్ష ఐదు వేలు విలువ చేసే మూడు బ్యాటరీ సామర్థ్యం గల ట్రై సైకిళ్లను శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వారికి పంపిణీ చేయడం జరిగిందని రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు డి. నిరంజన్‌బాబురెడ్డి తెలిపారు. ఇప్పటికే ఎన్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు ద్వారా వందలాది మందికి ట్రై సైకిళ్లను తల్లి, తండ్రి లేని అనాథలకు వేలాది రూపాయలు బ్యాంకులో డిపాజిట్ చేసి ఆ పత్రాలు కూడా వారికి అందజేశారన్నారు. అటువంటి మంచి మనసున్న మారాజు కోవూరు ఎమ్మెల్యే అని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అనంతరం పెళ్లకూరు కాలనీకి చెందిన సిద్ధపల్లి గీత, శాంతినగర్‌కు చెందిన పి. శ్రీనివాసరావు, గంగవరం గ్రామానికి చెందిన పొంగూరు శ్రీనివాసులుకు ఈ బ్యాటరీ సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డికి, తనయుడు రజిత్‌కుమార్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, పడుగుపాడు సొసైటీ చైర్మన్ ఆర్. మల్లికార్జున్‌రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ సుబ్బారెడ్డి, గంగవరం సర్పంచ్ లక్ష్మీకుమారి, కోవూరు ఉప సర్పంచ్ మైనుద్దీన్, వైసీపీ నేతలు అంజన్‌రావు, శ్రీధర్, అత్తిపల్లి అనూప్‌రెడ్డి, చిరంజీవి, సుబ్బారెడ్డి, భాస్కర్, బెల్లంకొండ విజయ్‌కుమార్, వెంకటరమణారెడ్డి, సుధీర్, కమ్రు, తదితరులు ఉన్నారు.

## సంగం తహసిల్దారుగా నాగరాజు



**సంగం జూలై 22 ప్రభాతవార్త** సంగం తహసిల్దారుగా వై .నాగరాజు బాద్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మండలంలో రెవిన్యూ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. ప్రజలందరు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ఎస్‌పి చేతులు మీదుగా ప్రశంస అందుకున్న సిఐ గిరిబాబు



**ఉదయగిరి జూలై 22 ప్రభాతవార్త** ఉదయగిరి మం దలంలోని సర్కిల్ ఇనస్పెక్టర్ వి.గిరిబాబుకు నెల్లూరు లో ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లానేర సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్‌పి డాక్టర్ కె.తిరుమలేశ్వర్‌రెడ్డి ప్రశంసాపత్రాన్ని అం దించారు.ఇటీవల కాలంలో వైజాగ్ కేంద్రంగా పలు ప్రాంతాలలో గంజాయి అమ్మకాలు జ రిపిని ముఠాను అత్యంత వ్యూహా త్మకంగా వారిని అదుపులోకితీసుకొని అక్రమ గంజాయి రవాణాను సమర్దవంతంగా పట్టుకున్నందుకుగానుఈ ప్రశంసా పత్రాన్ని అందించారు.సిఐ వి గిరిబాబు మాట్లాడుతు జిల్లా ఎస్‌పి ఇచ్చిన ప్రోత్సహంతో అప్పగించిన కేసుల ను చేదిస్తామని ఆయన తెలిపారు.ఈ ప్రశంసాపత్రాల ద్వారా తన బాధ్యత మరింత పెరిగిందని ఉదయగిరి సర్కిల్ పరిధిలో నేరాలను అదుపు చేయడానికి క్రైమ్‌రేటు లేకుండా చేసేందుకు కృషి చేస్తానని అన్నారు.

## కక్షతోనే హత్యాయత్నం

### బాలాజీపై రౌడీషీటు ఓపెన్ చెయ్యాలి



**నెల్లూరు జూలై 22, ప్రభాతవార్త-వైద్యం** సర్వేపల్లి నియోజకవర్గంలోని చింతోపు సర్పంచ్ కుమారుడు బాలాజీ, అదే గ్రామ దళిత కులానికి చెందిన మహేంద్రను రాజకీయ కక్షతో కావాలనే కారుతో గుద్ది చం పేందుకు ప్రయత్నించాడని తిరుపతి పార్లమెంటు ఎస్సీ సెల్ అధ్యక్షుడు, శ్రీపతిబాబు, రాష్ట్ర కార్యదర్శి జన్ని రమణయ్యలు ఆరోపించారు. శనివారం నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కేంద్ర కార్యాలయంలో వారు బాధితుడి భార్యతో కలిసి విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపతిబాబు, రమణ య్యలు మాట్లాడుతూ మహేంద్ర టీడీపీ కార్యకర్త, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి అభిమాని పేర్కొన్నారు. ఒక కార్యకర్తగా అభిమానిగా టీడీపీ కోసం నిరంతరం జెండాలు, ఫ్లెక్సీలను కూడా నాటుతూ తన అభి మానాన్ని చాటుకునేవాడన్నారు. ఈ విషయంలో పలుసార్లు బాలాజీ మహేంద్రను బయపెట్టడం కూడా జరిగిందన్నారు. ఈసారి టీడీపీ, చంద్రమోహన్‌తో కాని తిరిగి పనిచేస్తే నీ చావు తప్పదు నిన్ను మట్టుపెడ తామన్నా మహేంద్ర వెనుకడుగు వేయకుండా పార్టీ పనిచేయడంతో అతనిని అంతమొందించాలని, పక్కాగా కారుతో మహేంద్రను గుద్దేశాడన్నారు. అతనిని ఎన్నోసార్లు వైసీపీలోకి రావాలని ఆ గ్రామ సర్పంచ్ కూడా బలవంతం చేయడం జరిగిందన్నారు. తాను ఎట్టి పరిస్థితుల్లో సోమిరెడ్డిని, టీడీపీని వీడనని ఖరాఖండిగా చెప్పడంతో సర్పంచ్ కుమారుడు బాలాజీ కక్ష కట్టి అందరూ చూస్తుండగానే అతనిని కారుతో గుద్ది చంపబోయాడన్నారు. లోకేష్ పాదయాత్రకు ఫ్లెక్సీలను కట్టాడన్నారు. దానిని దృష్టిలో ఉంచుకుని బాలాజీ కారుతో గుద్ది, ఇంకా చావలేదనే అనుమానంతో మరలా కారును వెనక్కి తీసుకొచ్చి తొక్కించే ప్రయత్నంలో ఆ గ్రామస్తులు బాలాజీని పట్టుకుని లాక్కెళ్ళి పోలీసుస్టేషన్‌లో అప్పచెప్పడం జరిగిందన్నారు. తోటపల్లి గూడూరు ఎస్ఐ బాలాజీపై 307 కేసును నమోదు చేసి, ఆ రాత్రే స్టేషన్ నుంచి తప్పించడం జరిగిందన్నారు. దీని వెనుక మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి హస్తం ఉందని వారు ఆరోపించారు.సర్వేపల్లి నియోజకవర్గంలో 70 వేల ఓట్ల పైచిలుకు ఉన్నా గోవర్ధన్‌రెడ్డి కనీసం నైతిక మద్ధతు కూడా తెలియచేయకపోవడం దుర్మార్గమన్నారు. జగన్ దళితులను చంపేయమని ఆదేశాలు వస్తున్నాయని, ఆ పరంపర సర్వేపల్లి నియోజకవర్గంలో కొనసాగుతోందన్నారు.

ఆరు కేసుల్లో ముద్దాయిగా ఉన్న బాలాజీని ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. తక్షణమే అతనిపై రౌడీషీటు ఓపెన్ చెయ్యాలని ఆ గ్రామస్థులు కూడా కోరుకుంటున్నారని, ఈ ఘటనతో శ్రీపతిబాబు, రమణయ్యలు వారు డిమాండ్ చేశారు. పోలీసుల వ్యవహారశైలి బాలాజీకి అనుకూలంగా ఉందని, ఈ సర్వేపల్లిలో అసలు పోలీసువ్యవస్థ ఉందాని విమర్శించారు. దళితులకి ఒక న్యాయం ఇతర సామాజిక వర్గాల వారికి మరో న్యాయమాని ప్రశ్నించారు. దళితుడిపై దాడి చేసిన వ్యక్తిపై ఎస్సీ ఎస్టీ కేసును బాలాజీపై ఉఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. దళితుల సర్వేపల్లి నియోజకవర్గంలోని కందమూరు నారా యణ, ఆత్మకూరు జయపాల్, బద్వేల్ వెంకన్నపాలెం వదనాల వెంకటరమణల హత్యలన్నింటికీ హత్యలు, దాడులకు సూత్రధారి, పాత్రధారి కాకాణేనని ధ్వజమెత్తారు. దళితులను మట్టు బెట్టాలనే ఈ హత్యల వెనుక ఉద్దేశ్యమని, జగన్ దళిత వ్యతిరేకి కాబట్టే ఇలాంటి ఘోరాలు జరుగుతున్నాయన్నారు. ఈ జిల్లాలో చంద్రమోహన్‌రెడ్డి లేకపోతే దళితులు బ్రతికే పరిస్థితి లేదన్నారు. తక్షణమే ఎస్ఐని విధుల నుంచి బహిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. నారాయణ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహేంద్రకి వారి కుటుంబానికి న్యాయం జరగపోతే ఎస్పీ కార్యాలయం వద్ద ధర్నాకు దిగుతామని వారు హెచ్చరించారు. దీని పై బీజేపీ, జనసేన, సీపిఐ, సీపిఎం పార్టీలన్ని కూడా మీ పార్టీ ఎస్సీ విభాగాల ఆధ్వర్యంలో మహేంద్రకి ఆయన కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటాలు చేయాలని వారు పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో వైసీపీ ప్రభుత్వానికి దళితుల ఓట్లతో రాజకీయ సమాధి చేస్తామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో బాధితుడి భార్య, నాయకులు పాల్గొన్నారు.

## నేటి తరానికి ప్రధానం మానసిక ఆరోగ్యం

**నెల్లూరు జూలై 22, ప్రభాతవార్త-వైద్యం** నేటి తరానికి అన్నింటికంటే ప్రధానంగా కావాల్సింది మానసిక ఆరోగ్యమేనని నారాయణ ఆసుపత్రి న్యూరాలజీ విభాగాధిపతి ఎన్ఎస్ సంపత్‌కుమార్ పేర్కొన్నారు. ప్రపంచ మెదడు దినోత్సవం సందర్భంగా శనివారం నారాయణ ఆసుపత్రి న్యూరాలజీ విభాగాధిపతి సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మూర్ఛ, మైగ్రేన్, డిప్రెషన్, మతిమరుపు, పక్షవాతం తదితర మెదడు రుగ్మతల గురించి ఆయన ప్రజలు, ఆసుపత్రి సిబ్బందికి అవగాహన కల్పించారు. వ్యాధి నిర్ధారణ ప్రాథమిక దశలో జరిగితే వైకల్యాన్ని నివారించడంలో సహాయపడుతుందన్నారు. పక్షవాత లక్షణాలు కనిపించిన వారిని 4నుంచి 5గంటలలోపు ఆసుపత్రికి తీసుకురావడం ద్వారా థ్రాంబోలైసిస్‌తో పక్షవాతాన్ని నివారించవచ్చన్నారు. మెదడు వ్యాధులను రాకుండా ఉండాలంటే నిద్ర, సానుకూల దృక్పథంతోపాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని నిర్వహించడం వలన ఆరోగ్యకరమైన సహచరుల, కుటుంబ సంబంధాలను కొనసాగించడం లాంటివి దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాధిక, మార్కెటింగ్ విభాగంలోని పిఆర్‌ఓలు, ఆసుపత్రి డిజిఎం తదితరులు పాల్గొన్నారు.

## మణిపూర్ హింసాకాండపై బోగోలులో నిరసన




**బిట్రగుంట, జూలై 22 ప్రభాతవార్త** మండల కేంద్రమైన బోగోలులోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద మణిపూర్ హింసాకాండపై ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. మణిపూర్ రాష్ట్రంలో గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేసిన వ్యక్తులను ఉరితీయాలని,మణిపూర్ ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ రాష్ట్రాలలో ఎస్సీ,ఎస్టీలపై దాడులు పెరిగిపోయాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో జరిగిన హింసాకాండ ప్రపంచ దేశాల ముందు మన దేశం తలదించుకునేలాగా చేయడమే గాక సుప్రీంకోర్టు న్యాయమూర్తులను కూడా తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఇటీవల ఒంగోలులో గిరిజనుడిని కిరాతకంగా కొట్టి మూత్రం తాగించడం కూడా మన రాష్ట్రంలో చోటుచేసుకుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటువంటి ఘటనలు, అత్యాచారాలను నిరోధించి మహిళలకు గట్టి భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. జైభీమ్ అంబేద్కర్ సేవాదళ్ అధ్యక్షులు బత్తుల రవిచంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి, మానవ హక్కుల ప్రకాశం జిల్లా అధ్యక్షులు దాసరి సునీల్, ప్రజాసంఘాల నేతలు మిట్టా అశోక్, నూరుద్దీన్, సుభాని, బొందు నిర్మల్‌కుమార్, నీలంబొట్లు, ఆకుల సురేష్,రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారికి సాయం అందించండి



**బిట్రగుంట, జూలై 22 ప్రభాతవార్త** బోగోలు మండలం ముంగమూరు ఆదరణ కేంద్రంలో వున్న రెండు నెలల అనాధ పసిపాపకు గుండెకు రంధ్రం, ఊపిరితిత్తులలో నెమ్ము చేరడంతో నెల్లూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించినట్లు ఆదరణ కేంద్ర డైరెక్టర్ కె.సింహాద్రిరావు తెలిపారు.అయితే ఆ చిన్నారికి వైద్యం చేయించేందుకు చెన్నై తరలించాలని డాక్టర్లు చెప్పారని కాగా అక్కడికి వెళ్లాలంటే తరలింపుతో పాటు వైద్య ఖర్చులు 5 లక్షల రూపాయల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారని చెప్పారు. కావున దాతలు ఎవరైనా ముందుకు వచ్చి సాయం అందించాలని వివరాల కోసం ఆదరణ కేంద్రం ముంగమూరును సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

## శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో రోప్ స్కిపింగ్ సెలక్షన్స్

**కావలి రూరల్, జూలై 22 ప్రభాతవార్త** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రోప్ స్కిపింగ్ ఆధ్వర్యంలో కావలి పాతవూరులోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఆదివారం 10,12,14,16,18,20 సంవత్సరాలు కల్గిన స్త్రీ, పురుషులకు రోప్ స్కిపింగ్ సెలక్షన్స్ జరుగుతాయని రోప్ స్కిపింగ్ కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సెలక్షన్స్‌కు రాదలచిన వారు ఆధార్‌కార్డు తీసుకొని రావాలని తెలిపారు. ఇక్కడ ఎంపికైన వారు కర్నూలులో జరుగు రాష్ట్ర స్థాయి పోటీలకు సెలెక్ట్ చేయబడుతారని తెలిపారు. వివరాలకు 8919036160 సెల్ నెంబరులో సంప్రదించాలని కోరారు.

## అనాధ పిల్లలకు అన్నదానం



**విడవలూరు, జూలై 22, ప్రభాతవార్త** కోవూరు మాజీ ఏఎంసీ చైర్మన్ పుండ్ల అచ్యుత్‌రెడ్డి జన్మదిన వేడుక సందర్భంగా శనివారం కొడవలూరులో విశ్వనిలయం అనాధ ఆశ్రమం పిల్లలకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాధాశ్రమం సంబంధించి ఏదైనా అవసరం వస్తే అందుబాటులో ఉంటానని తెలియజేశారు. అనంతరం విడవలూరులోని ఆయన నివాసంలో వైసీపీ నాయకులు పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పంటల బీమా సొమ్ము స్వాహా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి



**కావలి రూరల్, జూలై 22 ప్రభాతవార్త** జలదంకి మండలం బ్రాహ్మణక్రాకలో పంటల బీమా సొమ్మును స్వాహా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకొని రికవరీ చేయాలని సిపియం, సిపిఐ జలదంకి, కావలి మండలాల నేతలు డిమాండ్ చేశారు. శనివారం కావలి ఆర్డీవో కార్యాలయంలో అధికారికి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. జలదంకి మండలం బ్రాహ్మణక్రాక గ్రామంలో పంటల నష్టపరిహారం బీమా సొమ్మును కొందరు స్వాహా చేశారన్నారు. రైతు భరోసా కేంద్రం ఉద్యోగి, పంచాయతీ అధికారులు, గ్రామంలోని కొంతమంది రాజకీయ నాయకులు కలిసి 78 లక్షల 97 వేల 420 రూపాయలు అర్హత లేని వారి ఖాతాలలో జమ చేసి స్వాహా చేశారని ఆరోపించారు. ఈ నగదు మొత్తాన్ని అర్హులైన జలదంకి, కావలి, బోగోలు మండలాల్లోని రైతులకు అందజేయాలని డిమాండ్ చేశారు. 2022 సంవత్సరంలో వడగళ్ళ వర్షం వల్ల నష్టపోయిన ఈ మండలాల్లోని వారిని విచారించి అందజేయాలన్నారు. పంటల బీమా నగదు కాజేసిన వారిపై కఠిన చర్యలు తీసుకొని వారి వద్ద నుండి నగదును రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జలదంకి మండల నాయకులు దమ్ము దర్గాబాబు,సిపియం నేతల టి.మాల్యాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం పట్టణ అధ్యక్షులు పేముల సీతారామయ్య, నాయకులు మాధవరపు మహేష్, ఎస్.మధు,యం.శ్రీనివాసులు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

## రుద్రకోటలో మహాశక్తి మహిళల పర్యటన



**కావలి రూరల్, జూలై 22 ప్రభాతవార్త** కావలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు ఆదేశాల మేరకు మహాశక్తి మహిళలు శనివారం కావలి రూరల్ మండలం రుద్రకోట గ్రామంలో మహాశక్తి వాహనంలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారాన్ని నిర్వహించారు. మాలేపాటి నాయకత్వం వర్ధిల్లాలి, మహాశక్తి వర్ధిల్లాలని నినాదాలు చేశారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ప్రకటించిన మినీ మేనిఫెస్టోలో మహిళలకు వున్న సౌలభ్యాలను అందరికి అర్ధమయ్యేలా తెలియజేశారు. మహిళలపై జరుగుతున్న అన్యాయాలు, అరాచకాలకు వైసిపి ప్రభుత్వమే కారణమంటూ మహిళల శక్తితో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలంటూ ప్రజలు దీవిస్తూ ఆశీర్వదించిన పసుపుతాడులను మహాశక్తిలోని మహిళలకు అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కావలి పట్టణ మహిళా అధ్యక్షురాలు ద్రోణాదుల వాసంతి, కొల్లూరు అశ్విని, పసుపులేటి పద్మ, రాధమ్మ, కట్టమూరి శ్రీదేవి, బత్తమ్మ, రుద్రకోట టిడిపి నాయకులు తుళ్ళూరు మల్లికార్జున, పేరం రవిబాబు, దాసరి శ్రీనివాసులు, నారుబోయిన దాసు, పులుసు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

